క్లుప్తంగా

విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు

సీలేరు : సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పలు పాఠశాలలో, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.పిల్లలకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయాలని, దీంతో నులిపురుగులను నివారించవచ్చన్నారు. నులిపురుగుల నివారణ మందుతో పిల్లల్లో రక్తహీనత సమస్య ఉండదన్నారు. వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.
రాజవొమ్మంగి: జడ్డంగి పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మందును వైద్యాధికారులు సుజి, యామిని అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు ఇస్తున్నామన్నారు. హెచ్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ, ఏఎన్ఎంలున్నారు.

ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్

కొయ్యూరు: మండలంలోని సింగవరంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎంపీపీ బడుగు రమేష్ బాబు మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, వ్యవసాయ పనిముట్లు రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మర్రిపాకల వద్ద పాడైన చెక్‌డ్యామ్‌ను మరమ్మతు చేయాలని కోరారు. చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, చిన్నారావు, ఏవో ఉమాదేవి, ఏఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

ఈ-క్రాప్ తప్పనిసరి


మాట్లాడుతున్న మత్స్యరాజు

గూడెంకొత్తవీధి: రైతులు విధిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మచ్చల మత్స్యరాజు అన్నారు. గూడెంలో రైతు సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ మినుముల విత్తనాలు వారంలో ఆర్‌బీకేలకు వస్తాయని తెలిపారు.దీనికి సంబంధించి వెయ్యి క్వింటాళ్లను ప్రతిపాదించామన్నారు. పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. సభ్యులు బాలయ్య, రాజుబాబు, వెటర్నరీ సహాయకులు జాన్నీ, ఆర్‌బీకే ఇన్‌చార్జి పరమేష్, బలరాం, ఎంపీఈవో జోసఫ్ తదితరులు పాల్గొన్నారు

అంగన్‌వాడీ భవనాల పరిశీలన


బీటాలో అసంపూర్తిగ ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీటీసీ సుబ్బలక్ష్మి

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ బీటా, తాల్లబుతోట గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాలను శుక్రవారం ఎంపీటీసీ సుబ్బలక్ష్మి పరిశీలించారు. అసంపూర్తి పనులపై ఆరా తీశారు. 2015లో టీడీపీ ప్రభుత్వ హయాంలో నూతన భవనాలకు నిధులు మంజూరు అయ్యాయని, సంబంధిత కాంట్రాక్టర్, అప్పటి అధికారులు కుమ్మక్కై బిల్లులు మార్చుకొని, భవనాలను అసంపూర్తిగా వదిలేశారని స్థానికులు చెప్పారని ఎంపీటీసీ సుబ్బలక్ష్మి చెప్పారు. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయించి, అందుబాటులో తీసుకు రావాలని కోరారు.

క్షయపై అవగాహన

రాజవొమ్మంగి: దూసరపాము, లబ్బర్తి, రాజవొమ్మంగి, కింద్ర పంచాయతీల్లో క్షయ వ్యాధిపై ప్రకృతి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సంస్థ కో-ఆర్డినేటర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. క్షయపై అనుమానం ఉంటే సమీపంలోని పీహెచ్‌సీలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

సర్వ సేవాలయాలు

- ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు
- నియోజకవర్గంలో 115 సచివాలయాలు
- ఆనందంలో గిరిజనం

అరకులోయటౌన్: సమస్త సేవల నిలయంగా, ప్రజా సమస్యల పరిష్కార వేదికగా సంక్షేమాన్ని అందించే దీపికగా ప్రభుత్వ సేవలను అందిస్తూ సచివాలయ వ్యవస్థ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. మహాత్ముని కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారు. ప్రజల చెంతకే ప్రభుత్వ పాలనను తీసుకొచ్చారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించి సచివాలయ సిబ్బంది ప్రజల చేత శభాష్ అనిపించుకుంటున్నారు. రాష్ట్రంలో అమలవుతున్న గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది.

అంకితభావంతో సేవలు

అరకులోయ నియోజకవర్గంలోని అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముచ్చంగిపుట్ ఆరు మండలాల్లో 115 సచివాలయాలున్నాయి. ఒక్కో సచివాలయానికి రూ.45 లక్షలు కేటాయించారు. మొత్తం అన్ని సచివాలయాల్లో 1,265 మంది వివిధ శాఖల సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారు. నియోజకవర్గంలో అన్ని సచివాలయాల నూతన నిర్మాణాలకు ప్రభుత్వం రూ. 51.75 కోట్ల నిధులను కేటాయించింది. నియోజకవర్గంలో ఇప్పటివరకు 15 సచివాలయ భవనాలను పూర్తి చేశారు. మరో 100 సచివాలయాలు నిర్మాణ దశలో ఉన్నాయి. సంతృప్తికర రీతిలో పూర్తి పారదర్శకంగా, సమర్థవంతంగా సచివాలయ సిబ్బంది విధులు నిర్వర్తిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

సేవలన్నీ ఒకే గూటికి

గత టీడీపీ హయాంలో కుల, ఆదాయ, జనన, మరణ తదితర ధ్రువీకరణ పత్రాల కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అందుబాటులో వచ్చి గ్రామ సచివాలయాల ద్వారా అన్ని సేవలు అందుతున్నాయి. సచివాలయంలో పంచాయతీ, గ్రామ మహిళా సంరక్షణ, రెవెన్యూ సెక్రటరీలు, డిజిటల్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, వెటర్నరీ, ఎమర్జెన్సీ, సర్వే, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు కలిసి మొత్తం 11 మంది వివిధ శాఖల అధికారులు సేవలందిస్తున్నారు. సచివాలయాల కేంద్రంగా రైతు భరోసా కేంద్రాలు, మల్టీపర్పస్ పంక్షన్ సెంటర్స్, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ వివిధ సేవలు ప్రజలకు అందిస్తున్నాయి. నేడు సచివాలయ స్థాయిలో గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తున్నారు. గ్రామ సచివాలయాల ద్వారా 156 వివిధ రకాల సేవలందుతున్నాయి. అరకులోయ మండలంలో ఏడు భవనాలు రెండవ శ్లాబ్ వేశారు. ఆరు భవనాల్లో పనులు చివరిదశకు చేరినట్టు అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా అనంతగిరి మండలంలో-2, డుంబ్రిగుడ-2., హుకుంపేట-4, పెదబయలు-4, ముంచంగిపుట్టు-5 భవనాలు చివరి దశకు చేరినట్టు తెలిపారు.



కాశీపట్నంలో గ్రామ సచివాలయం

సేవ చేసే అవకాశం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి మాకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. గిరిజనులకు సేవ చేసే అవకాశం కల్పించారు. సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత సేవలు మరింత సులభతరమయ్యాయి. అన్ని రకాల సేవలు గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సకాలంలో, సక్రమంగా అందజేస్తున్నాం.

– పెట్టెలి రాజుబాబు,
ఇంజినీరింగ్ అసిస్టెంట్, పెదలబుడు,
అరకులోయ మండలం

జోరుగా నిర్మాణ పనులు



అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సచివాలయాల నిర్మాణాలు పనులు జోరందుకున్నాయి. కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు అడ్వాన్స్ తీసుకొని పనులు నిలిపివేశారు.దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా కాంట్రాక్టర్ల నుంచి సొమ్ము రికవరీ చేయాలని తహసీల్దార్‌లకు ఆదేశించారు. సొమ్ము రికవరీ చేయలేని వారిపై చట్టరీత్యా చర్యలుంటాయి. పూర్తయిన భవనాలను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం.

– ఆర్.రామమ్,
డీఈఈ, పీఆర్ శాఖ, అరకులోయ

పండ్ల మొక్కల పెంపకంపై ప్రోత్సాహం


ఏపీవో జగదీశ్వరరావు

అరకులోయటౌన్: ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో పండ్ల మొక్కల పెంపకంపై గిరి రైతులను ప్రోత్సహిస్తున్నట్టు ఏపీవో జగదీశ్వరరావు చెప్పారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గిరిరైతులకు బాదం,శీతాఫలం, నేరేడు, కొబ్బరి, మామిడి, నిమ్మ తదితర రకాల 80వేల మొక్కలు పంపిణీ చేశామన్నారు. ప్రహరీ, కంచె ఉన్న 24 చోట్ల మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టామన్నారు. నా మట్టి–నాదేశం కార్యక్రమంలో భాగంగా ఒక్కో గ్రామ పంచాయతీకి 75 మొక్కల చొప్పున అన్ని పంచాయతీలకు మొక్కలు పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం 7 గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించామన్నారు. నాటిన మొక్కల సంరక్షణకు రూ. 1 లక్ష చొప్పున రూ.24 లక్షలు అందిస్తామన్నారు. అంతే కాకుండా ఉద్యానవనం తోటల పెంపకానికి 527 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టి, 325 ఎకరాల్లో 50వేల సిల్వర్ ఓక్ మొక్కలు పంపిణీ చేశామన్నారు. 138 ఎకరాల్లో నిమ్మ, పండ్ల మొక్కలు పంపిణీ చేసినట్టు ఏపీఓ జగదీశ్వరరావు తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


గణేశ్వరరావును సత్కరిస్తున్న పశువైద్య సిబ్బంది

అరకులోయటౌన్: రాష్ట్ర పశువైద్యాధికారుల సంఘం సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన సాగర గణేశ్వరరావుకు శుక్రవారం ఘనంగా సత్కరించారు. సహాయ సంచాలకులు డాక్టర్.నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాశీపట్నం పశువైద్యాధికారి గణేశ్వరరావు మాట్లాడుతూ పశువైద్యశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతగిరి, సుంకరమెట్ట పశువైద్యులు సీనయ్య, సందీప్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పుష్పలమ్మ సేవలు మరువలేనివి

హుకుంపేట: బారమసి పంచాయతీ నీలంపుట్టు గ్రామంలో సర్పంచ్ పుష్పలమ్మ సంస్మరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు పుష్పలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ సర్పంచ్‌గా పుష్పలమ్మ చేసిన మరువలేనివన్నారు. తన కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఎంపీపీ కూడా రాజుబాబు, సర్పంచ్‌లు దనసాని సత్యవతి, ఈశ్వరమ్మ, సాంభ, అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యులు నాగలక్ష్మి, భీమలింగేశ్వరరావు, నాయకులు వెంకట్, మురళి, మహేష్, రాంబాబు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.
డుంబ్రిగుడ: మండలంలోని కితలంగి పంచాయతీ పాడి గ్రామానికి చెందిన వయ్యాబారికి మరిమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆమె కుటుంబసభ్యులను కలిసి పరామర్శించారు. సర్పంచ్ సుబ్బారావు, నాయకులు సింహాచలం, చిరంజీవి, గణపతి, అశోక్‌కుమార్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ వైఎస్సార్, టీఎస్సార్ ట్రస్టు వ్యవస్థాపకులు టి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పాటో సర్పంచ్ పుష్పలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు

కొయ్యూరు: యూ.చీడిపాలెం గ్రామ సచివాలయ సిబ్బంది శుక్రవారం ఉదయం 11గంటలైనా విధులకు హాజరుకాలేదని స్థానికులు చెప్పారు. పనులపై వచ్చిన తమకు ఇబ్బందులు తప్పలేదన్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో లాలం సీతయ్య వద్ద ప్రస్తావించగా విధులకు సక్రమంగా రాని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయ సిబ్బందికి విధులకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు.

గిరిజనుల అభ్యున్నతే లక్ష్యం


గిరిజనులకు ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి,పక్కన నాయకులు


బోడిగూడెం కాలనీలో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- గడప గడపకు విశేష స్పందన
- ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ధనలక్ష్మిలకు ఘన స్వాగతం

సాక్షి,పాడేరు: గిరిజనుల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. సలుగు సచివాలయం పరిధిలోని కక్కి, ఈదులపాలెం, సలుగు, రెల్లమామిడి, రంగసింగి, కె.లోలంగిపాడు, లోలంగిపాడు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఐ.హెచ్.ఫరూఖీతో కలిసి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆయా గ్రామాల్లో 380 గడపలను సందర్శించారు.
ప్రతి నివాసం వద్ద గిరిజనులు ఎమ్మెల్యేతో పాటు పార్టీ నేతలందరికి పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జయహో నినాదాలతో పల్లెలు హోరెత్తాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను గ్రామస్తులకు అందజేశారు. వైస్ ఎంపీపీ కనకాలమ్మ, ఎంపీటీసీ సభ్యులు మీనా, రామకృష్ణపాత్రుడు, నరసింహమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ సూరిబాబు, సర్పంచ్‌లు అప్పలకొండ, బీమాలమ్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దేవీపట్నం: పేద ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని పోలవరం ప్రాజెక్టు పునరావాస గ్రామాలైన బోడిగూడెం, డి.రావిలంక, పరగసానిపాడు కాలనీలల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో సుమారు 150 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ పారదర్శకంగా, పార్టీలకతీతంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురు గ్రామస్తులు పరిహారం ప్యాకేజీ సమస్యను ఎమ్మెల్యేకు తెలియజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి పోలవరం నిర్వాసితుల సమస్యలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, నిర్వాసితులందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ కుంజం మురళి, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి, నాయకులు బాబ్జి, సత్యనారాయణ,మురళీకృష్ణ, పెద్దబ్బాయిదొరలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

సాక్షి,పాడేరు: మండల కేంద్రంలోని మోద కొండమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం అమ్మ భగవాన్ భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. సనాతన ధర్మాన్ని పాటించాలన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యంను సత్కరించారు. బాలంనాయుడు, కృష్ణకుమారి, రామునాయుడు, మల్లిక, రామలింగంనాయుడు తదితరులు పాల్గొన్నారు.
గూడెంకొత్తవీధి: విశ్వశాంతి జ్యోతిర్మయి బాబా మండల స్థాయి ఆధ్యాత్మిక సమావేశం ఈనెల 20న అసరాడలో నిర్వహించనున్నట్టు అర్చకుల సేవా సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. భజనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆలయ ధర్మకర్త రామారావు, అర్చక సంఘం సభ్యులు చిన్నారావు, లక్ష్మణరావు, శాంతి పరమేష్, భారతీ, సరస్వతి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.


మోదకొండమ్మతల్లి ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న భక్తులు

కుంభా రవిబాబుకు అభినందనలు


హుకుంపేటలో కేక్ పంచిపెడుతున్న నాయకులు


డుంబ్రిగుడలో స్వీట్లు పంచుకుంటున్న నాయకులు


రవిబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశ్వేశ్వరరాజు

అరకులోయటౌన్/డుంబ్రిగుడ/హుకుంపేట/జీకే వీధి: ఎమ్మెల్సీగా డాక్టర్ కుంభా రవిబాబు నియామకంపై పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అరకులోయలో నాయకులు మిఠాయిలు పంచిపెట్టారు. బాణాసంచా కాల్చి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. మాజీ సర్పంచ్‌లు చిన్నారావు, ప్రకాష్, మాజీ ఎంపీటీసీ భాస్కరరావు, నాయకులు పల్టాసింగి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. డుంబ్రిగులో నాయకులు నిర్మల, కొములునాయుడు, రాం నాయుడు, గోపి తది తరులు పాల్గొన్నారు. హుకుంపేటలో మాజీ జెడ్పీటీసీ కాసులమ్మ, సర్పంచ్ రమేష్, నాయకుడు సూర్యం తదితరులు పాల్గొన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాజు విశ్వేశ్వరరాజు ఎమ్మెల్సీగా నియామకమైన కుంభా రవిబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధుల ఆశయ సాధనకు కృషి



అరకు డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం


జీకే వీధిలో శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నా మట్టి – నా దేశం కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె.భరత్‌కుమార్, డాక్టర్ సీహెచ్.రామకృష్ణ మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్య్ర సమరయోధుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజ్, చలపతిరావు, ఎన్ఎస్ఎస్ పీఓలు నాగరాజు, విజయలక్ష్మీ, లలితా కుమారి పాల్గొన్నారు.
సీలేరు : దారకొండలో సర్పంచ్ నడిగొట్ల రాజు ఆధ్వర్యంలో స్వతంత్ర్య అమరులకు నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు రామన్న, వార్డు సభ్యులు నరసమ్మ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బుజ్జి, ఉపాధి హామీ పథకం సిబ్బంది లింగరాజు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.
గూడెంకొత్తవీధి: పెదవలస శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ కృష్ణవంశీ, కో–ఆపరేటివ్ చైర్మన్ ప్రసాద్, ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు

నేడు ఫ్యాప్టో ధర్నా

పాడేరు: ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేస్తున్నట్టు నాయకులు తెలిపారు. ధర్నాకు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా శాఖ సంపూర్ణ మద్దతునిస్తుందని, సంఘ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు నీలకంఠం, శోభన్‌బాబు,ఇతర నేతలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మండల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

చింతపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనూషదేవి అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం నిధులు చేస్తోందని, దీంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను తెలియజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీడీవో ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ వెంగళయ్య, ఈవోపీఆర్డీ డి.శ్రీనివాస్, ఎంఈవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో ఎంపీపీ అనూషదేవి తదితరులు

గ్రామాల్లో జోరుగా ఫ్రైడే డ్రైడే

ముంచంగిపుట్టు: గ్రామస్తులు పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని కిలగాడ వైద్యాధికారి ఎస్.రమేష్ అన్నారు. మండలంలోని కిలగాడ పంచాయతీ తాంగుల, మొక్కపుట్టు, నందిమెట్ట, వెచ్చంగి గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మురుగునీటి కాలువలను శుభ్రం చేయించి, బీచింగ్ జల్లించారు. ఆయా గ్రామాల్లో పాఠశాలల్లో పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రాలను మింగించారు. మొక్కపుట్టు గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేసి, మందులు అందజేశారు.బంగారుమెట్ట పంచాయతీ కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించి, విద్యార్థినులకు వైద్య సేవలందించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా గిరిజనులు జాగ్రత్తలు పాటించాలని, ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను, సిబ్బందిని సంప్రదించి, వైద్య సేవలు పొందాలని, గ్రామాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. ఆరోగ్య విస్తరణ అధికారి కె.సుబ్రహ్మణ్యం,హెల్త్ అసిస్టెంట్ కె.మోహన్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మొక్కపుట్టు వీధిలో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

డ్రాపౌట్స్‌ను బడిలో చేర్పించాలి

అడ్డతీగల: డ్రాపౌట్స్‌ని గుర్తించి బడిలో చేర్పించే విషయాన్ని బాధ్యతతో తీసుకోవాలని ఎంపీడీవో కె.బాపన్నదొర అన్నారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి సంక్షేమ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీసులు సచివాలయం పరిధిలోని పాఠశాలతో పాటు వసతి గృహాలను సందర్శించి దీర్ఘకాలంగా డ్రాపౌట్‌లుగా ఉన్న వారి వివరాలు తీసుకొని వారిని గుర్తించాలన్నారు. ప్రస్తుతం ఆ డ్రాపౌట్ విద్యార్థులు వివరాలు అందజేయాలన్నారు. గ్రామ వలంటీర్ల ద్వారా వారిని తిరిగి పాఠశాలకు పంపించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న విధానాన్ని నిశితంగా పరిశీలించి లక్ష్యం మేరకు ఫలితాలు వచ్చేలా తాము క్షుణ్ణంగా పరిశీలన జరువుతామన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అడ్డతీగలలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించామన్నారు. ఇద్దరు డ్రాపౌట్‌లు ఉన్నట్టు గుర్తించినట్టు చెప్పారు. ఆయా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని తిరిగి పాఠశాలకు పంపేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఒక డ్రాపౌట్‌ని ఆశ్రమ ఉన్నత పాఠశాలలోను మరో ముగ్గురు డ్రాపౌట్ విద్యార్థులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తిరిగి పాఠశాలలో చేర్పించామన్నారు. సంక్షేమ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ మహేష్, మహిళా పోలీసు వీరలక్ష్మి, అడ్డతీగల గ్రామసచివాలయం–1 సిబ్బంది పాల్గొన్నారు.


డ్రాపౌట్‌ల అంశంపై చర్చిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర